'పది'ంతల ఉత్సాహం

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ఉత్తమ మార్కులతో విద్యార్థుల సత్తా

ఏయూ క్యాంపస్: ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. గతేడాది కన్నా మెరుగైన ఉత్తీర్ణత సాధించాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నాయి.

కేడీపీఎంలో 22 శాతం పెరిగిన ఉత్తీర్ణత

స్థానిక 20వ వార్డు కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాలలో 65 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది ఉత్తీర్ణత 43 శాతం కాగా.. ఈ సారి 22 శాతం ఉత్తీర్ణత పెరిగి 65 శాతం మంది పాసయ్యారు. మొత్తం 142 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 92 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 46 మంది ప్రథమ శ్రేణిలో, 30 మంది ద్వితీయ శ్రేణిలో, 16 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

- పాఠశాల విద్యార్థి హేమంత్ కుమార్ 527 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలవగా, శ్రీ మహా తులసి 525, అమిటి శంకర్ 522, పి.ఫణి


ప్రతిభ చూపిన కేడీపీఎం పాఠశాల విద్యార్థులు

హాస్ 503, తరుణ్ 501 మార్కులు సాధించారు.

- సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత పరిశీలిస్తే ఇంగ్లిష్‌లో 99.3, గణితంలో 80.2, సోషల్ స్టడీస్‌లో 82, సైన్స్‌లో 77, తెలుగులో 87, హిందీలో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒక సబ్జెక్టులో ఫెయిలైన వారు 17 మంది, రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైన వారు 13 మంది ఉన్నారు. త్వరలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు వీరంతా సన్నద్ధం అవుతున్నారు.

ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో 97.5 ఉత్తీర్ణత

ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో 82 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 80 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 97.5గా నమోదైంది. వీరిలో ప్రథమ శ్రేణిలో 74, ద్వితీయ శ్రేణిలో 5, తృతీయ శ్రేణిలో ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థి కె.కృష్ణంరాజు 578 మార్కులు, ఎన్.సాయి దుర్గ 567 మార్కులు, ఓ.జాహ్నవి 553 మార్కులు సాధించారు.

తోటగరువు హైస్కూల్‌లో..

ఆరిలోవ: స్థానిక తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాలలో గత ఏడాది కంటే 10 శాతం ఉత్తీర్ణత పెరిగింది. గతేడాది 35 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే చివర స్థానంలో నిలిచిన ఈ పాఠశాల ఈ ఏడాది 45 శాతం ఉత్తీర్ణత సాధించి కొంత మెరుగుపడింది. గతేడాదిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులు ఐదుగురు కాగా.. ఈ ఏడాది వారి సంఖ్య 13 మందికి పెరిగింది. ఈ ఏడాది ఇక్కడ 357 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 162 మంది ఉత్తీర్ణులయ్యారు. 92 మంది ప్రథమ, 42 మంది ద్వితీయ, 28 మంది తృతీయ శ్రేణిలో పాసయ్యారు. కాశి శ్రావణ్ 569 మార్కులో పాఠశాల టాపర్‌గా నిలవగా, 563 మార్కులతో ఏగిరెడ్డి మోనిక ప్రియ రెండో స్థానంలో నిలిచింది.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం


రామకృష్ణాపురంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


ఏయూలో అల్లూరి విగ్రం వద్ద నివాళి అర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఆరిలోవ: సీపీఐ ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గం కార్యదర్శి షేక్ రెహమాన్ మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, కాసుబాబు, చిరంజీవి, మస్తాన్ పాల్గొన్నారు.

ఏయూలో..

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వీసీ ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో, ముఖ్యంగా ఆదివాసీల పరిరక్షణకు అల్లూరి తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. విద్యార్థులు ఇటువంటి మహనీయుల జీవితాల నుంచి స్ఫూర్తిని పొందాలని సూచించారు. తమ జ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు, దేశ అభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, డీన్ ఆచార్య టి.షారోన్‌రాజు పాల్గొన్నారు.

అల్లూరి వ్యక్తి కాదు సంఘటిత శక్తి

బీచ్ రోడ్డు: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వ్యక్తి కాదు అని ఓ సంఘటిత శక్తి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాదమూర్తి

అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాదమూర్తి అన్నారు. ఏయూ తెలుగు విభాగం, సంగీత నృత్య శాఖలు, సమైక్య భారతి సంయుక్తంగా బీచ్‌రోడ్డులో ఆదివారం అల్లూరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించాయి. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వరప్రసాదమూర్తి మాట్లాడుతూ ఎంత కాలం మనం జీవించామనేది ముఖ్యకాదని, జీవించిన కాలంలో సమాజానికి ఏం చేశామన్నదే ప్రధానమన్నారు. అల్లూరి బహుభాషా కోవిదుడని, అస్త్రసాముద్రిక నిపుణుడని, ఆయుర్వేద వైద్యం ద్వారా ఆదివాసీలకు ఎనలేని సేవ చేసిన వ్యక్తి అని, ఆయన జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయల సుబ్బారావు, ఆచార్య జి.యోహాన్‌బాబు, ఆచార్య ఎ.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాంస్కృతిక విభాగం డైరెక్టర్ దూలి రఘుకు సన్మానం


రఘును సత్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: రాష్ట్ర సాంస్కృతిక విభాగం డైరెక్టర్‌గా నియామకమైన దూలి రఘును ఆదివారం సాయంత్రం పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి రఘు సేవలు అందిస్తున్నారని మేయర్ కొనియాడారు. కష్టపడిన కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొలగాని శ్రీనివాస్, బొట్టా కనకరాజు, కోలా బంగారయ్య, పెనల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల విద్యార్థుల బీచ్ క్లీనింగ్


బీచ్‌లో క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మద్దిలపాలెం: ప్లాస్టిక్ ఫర్ చేంజ్ పేరిట డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. తీరంలో చెత్త, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. బీచ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సేకరించడంతో పాటు క్లీనింగ్ కార్యక్రమంలో భాగస్వాములైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, రత్నభారతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ సమీపంలో ఇసుక తోటలోని రోసరీ కాన్వెంట్‌కు చెందిన 1999 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

విశాఖ వ్యాలీలో 'నీట్' సందడి


విశాఖ వ్యాలీ స్కూల్ సెంటర్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు


విద్యార్థులను వరుసగా పరీక్ష గదుల్లోకి పంపిస్తున్న సెక్యూరిటీ

ఆరిలోవ: వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్ష జాతీయ రహదారిని అనుకొని ఉన్న విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ సెంటర్‌లో 586 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వీరి కోసం 25 గదులు కేటాయించారు. విద్యార్థులను ఆయా గదుల్లోకి హాల్ టికెట్‌లో ఉన్న నంబరు ప్రకారం వరుసగా పంపించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు జరిగిన ఈ పరీక్ష కోసం ఇక్కడి కేంద్రానికి విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచే చేరుకున్నారు. విద్యార్థులు, వారితో వచ్చిన తల్లిదండ్రులతో ఇక్కడ సందడి నెలకొంది. ఆరిలోవ పోలీసులు బందోబస్తు నిర్వహించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. నిబంధనల ప్రకారం విద్యార్థులు బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్‌లు, ఎలాక్ట్రానిక్ వస్తువులు లోపలకు తీసుకెళ్లకుండా తనిఖీ చేశారు. బాలికల చెవులు, మెడలో ఉన్న బంగారు వస్తువులను తొలగించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

విద్యార్థి అదృశ్యం


జయ శంకర్ (ఫైల్)

ఎంవీపీ కాలనీ: పెద వాల్తేర్‌కు చెందిన వి.జయశంకర్(15) అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవాల్తేర్ కాగితాల వారి వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న జయశంకర్ 10వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అతనికి 480 మార్కుల రావడంతో రెండు రోజులుగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన జయశంకర్ తిరిగి రాలేదు. లేత గ్రీన్ చెక్స్ షర్ట్, బ్లూ జీన్స్ వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విశ్వకవి ఠాగూర్ జయంతి

ఏయూ క్యాంపస్: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రవీంద్రుని విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశిష్ట రచనా శైలితో నోబెల్ బహుమతిని సొంతం చేసుకుని ఠాగూర్ భారతీయ సాహిత్య ప్రతిభను ప్రపంచానికి చాటారన్నారు. అటువంటి మహనీయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సైతం సందర్శించి, ప్రసంగించారని గుర్తు చేశారు. నేటి తరం విద్యార్థులు ఇటువంటి వారి రచనలను సమగ్రంగా చదవడం, అధ్యయనం చేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, లైబ్రరీ టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఘంటసాలను భారతరత్నతో గౌరవించాలి

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు

మద్దిలపాలెం : అమరగాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావును భారతరత్న పురస్కారంతో గౌరవించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఘంటసాల ఆరాధకులు టెలిగ్రామ్ గ్రూప్ సభ్యుల సమర్పణలో ఘంటసాల ఆరాధనోత్సవాలను డాక్టర్.సయ్యదు రహమతుల్లా ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దాడి వీరభద్రరరావు మాట్లాడుతూ విశ్వ విఖ్యాత స్వరమాంత్రికుడు ఘంటసాల స్వరం సుస్థిరమైదన్నారు. విశ్వం ఉన్నంత వరకూ ఘంటసాల స్వరం వినిపిస్తునే ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ సయ్యదు రహమతుల్లా ఘంటసాల అవధాన ప్రక్రియను అద్భుతంగా నిర్వహించారు. ప్రేక్షకులు ఘంటసాల పాటలలో పల్లవి, చరణంలో ఏ ఒక్కటి అడిగిన ఠక్కున ఆ చిత్రం పేరు, స్వరపరిచిన సంగీత దర్శకుడు, చిత్రం విడుదల తేదీలతో సహా చెప్పడమే కాకుండా ఆ పాటను కూడా ఆలపించి ఔరా అనిపించారు. ఐదుగురు గాయనీమణులు, ఐదుగురు గాయకులతో నిర్వహించిన పాటల కబడ్డీ అలరించింది. అనంతరం ఘంటసాల నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విజయనిర్మాణ అధినేత సూరపనేని విజయకుమార్, డాక్టర్.కె.రామమూర్తి, బి.కల్యాణి తమ గానంతో అలరించారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు

సంకీర్తన సార్వభౌముడు అన్నమయ్య

సీతంపేట: శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి ఆశీస్సులతో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్యుని 615వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకడిగిన పాదము పేరిట అన్నమాచార్య సంకీర్తన పోటీలు జరిగాయి. పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగ్గేయకారుడిగా వేంకటేశ్వర స్వామి సేవలో తరించిన అన్నమయ్య సంకీర్తనా సార్వభౌమునిగా నిలిచారన్నారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు అతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ అధ్యక్షులు వి.ప్రభాకర్, సి.హెచ్.వి.సత్యనారాయణ, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఎస్.ఎస్.ఎస్.రాజు, పుండరీ కుమార్, మేడా మస్తాన్‌రెడ్డి, తిరుమలరావు, ఫణిస్వామి, సుబ్రహ్మణ్యం, జె.ఎస్.ప్రసాద్, న్యాయనిర్ణేతలు, కళాభిమానులు పాల్గొన్నారు.


విజేతకు ప్రశంసా పత్రం అందిస్తున్న అతిథులు

సందర్శకులతో హెల్త్ ఎరీనా కళకళ


పార్కులో వాకింగ్ చేస్తున్న యువత


వ్యాయామం చేస్తున్న యువతీ యువకులు

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనా సందర్శకులతో కళకళలాడుతోంది. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం నగరవాసులు పెద్ద ఎత్తున పార్కుకు వచ్చి సేదతీరుతున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఉదయం, సాయంత్ర వేళల్లో పార్కులో సందడి చేస్తున్నారు. 12 సెక్టార్లలో విస్తరించి ఉన్న ఎంవీపీ కాలనీలోనే అనేక కమ్యూనిటీ పార్కులు ఉన్నాయి. స్థానికంగా ఆయా సెక్టార్ల అసోసియేషన్లు ఆయా పార్కులను నిర్వహిస్తున్నాయి. అయితే హెల్త్ ఎరీనాలో సందర్శకులకు అనుగుణంగా సౌకర్యాలు ఉండడం, 3 కిలోమీటర్లకు పైగా వాకింగ్ ట్రాక్, సహజ సిద్ధమైన జాగింగ్ ట్రాక్ అందుబాటులో ఉండడంతో ఈ పార్కుకు వచ్చే సందర్శకులు రోజురోజుకు పెరుగుతున్నారు. ముఖ్యంగా యువతీ యువకులు ఉదయం, సాయంత్ర వేళల్లో పార్కుకు వచ్చి వాకింగ్, జాగింగ్ చేస్తూ సేద తీరుతున్నారు. వ్యాయామశాలను యువత, మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నారు.

రైల్వే ఉద్యోగి మృతి


కారులో సతీష్‌కుమార్ మృతదేహం

సీతమ్మధార: రైల్వే ఉద్యోగి ఒకరు కారులో మృతి చెందిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్ల పాలెం రైల్వే న్యూకాలనీలో నివసిస్తున్న కోమటిపల్లి సతీష్‌కుమార్(40) రైల్వేలో టెక్నీషియన్–3గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన నివాసం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కారులో అతడు చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు సునీల్ కుమార్ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో ఉన్న మృతుడి పక్కన గ్లాస్, మద్యం బాటిల్ ఉన్నట్లు గుర్తించారు. అధికారుల ఆదేశాల మేరకు హెచ్‌సీ షణ్ముకరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్(హైదరాబాద్), హ్యూమర్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వినోదాల విందు పేరిట కామెడీ స్కిట్లు ప్రదర్శించారు. నగరంలోని విశాఖ హ్యూమర్ క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్, లాఫ్టర్స్ ఫన్ క్లబ్, విశాఖరత్న హాస్య క్లబ్, లాఫింగ్ క్లబ్, హాస్య దర్బార్, బాబాయ్ లాఫింగ్ క్లబ్‌లకు చెందిన కళాకారులు పాల్గొని కామెడీ స్కిట్లు ప్రదర్శించి నవ్వుల్లో ముంచెత్తారు. వీటిలో లఘునాటకం, ఫ్లై వోవర్, గాడిద కొడుకు, ఐఏఎస్ ఐపీఎస్, సాంకేతిక లోపం, పాజటివ్ సూపర్ క్లయింట్, డాక్టరు పేషెంట్, ఊరకనే ఏటీఎం స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ ప్రకాష్ తనదైన శైలిలో కామెడీతో అలరించారు. కార్యక్రమంలో కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, ఎల్ఎస్ ఆర్ మూర్తి, రమణ, లక్ష్మి, నాగలక్ష్మి, మోహన్‌కృష్ణ, శారద, రంగారావు, త్రినాథ్, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, భానుప్రకాష్, ఇంది ఈశ్వరరావు, మల్లిక తదితరులు పాల్గొన్నారు.


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

నత్తనడకన రోడ్డు పనులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని చినగదిలి కూడలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదు నెలల్లో పూర్తి కావాల్సిన పనులు 10 నెలలు గడుస్తున్నా పూర్తి కాలేదు. ఇప్పటికీ సగం పనులు కూడా జరగలేదు. ప్రస్తుతం ఈ రోడ్డు 30 అడుగుల వెడల్పుతో ఉంది. దీన్ని విస్తరించి కొత్తగా నిర్మాణం చేపట్టడానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టారు. రూ. 2.35 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనుల కోసం గతేడాది జూలైలో శంకుస్థాపన చేశారు. నాలుగు, ఐదు నెలల్లో పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను అప్పట్లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదేశించారు. వారి ఆదేశాలతో ప్రారంభంలో ఈ పనులు చకచకా జరిగాయి. ఇందులో భాగంగా రోడ్డు పక్కన ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయం వైపు కాలువ నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం ఈ కొన్నాళ్ల పాటు పనులు నిలిపేశారు. ఇటీవల మళ్లీ పనులు ప్రారంభించినా నెమ్మదిగా చేపడుతున్నారు. ప్రస్తుతం 30 అడుగులు వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును 80 అడుగులకు విస్తరించి డబుల్ రోడ్డు నిర్మించదలిచారు. మధ్యలో డివైడర్ నిర్మించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో పాటు రోడ్డుకు ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు నిర్మించాలి. శంకుస్థాపన జరిగి ఇప్పటికి సుమారు 10 నెలలు గడిచినా రోడ్డు తవ్వకాలే పూర్తికాలేదు. దీంతో ఈ నిర్మాణం పూర్తికావడానికి ఇంకా ఎంత కాలం పడుతుందోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.


చినగదిలి షిరిడీ సాయిబాబా ఆలయం, సూర్య తేజానగర్ మధ్య జరుగుతున్న రోడ్డు పనులు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు. గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలన్నారు. ఎలాంటి తగాదాలో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా కేసుల్లో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ సూచించారు. అనంతరం రౌడీ షీటర్లను వారి నివాసం వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించి వచ్చారు. ఎస్ఐలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

సింహాచలం: రోడ్డు ప్రయాణించేటప్పుడు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సూచించారు. పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలను ఎస్ఐ వివరించారు. ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాలనే హరిస్తుందని తెలియజేశారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల 2022 సంవత్సరంలో నగరంలో 147మంది ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోయారని తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం సాగించాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు ద్విచక్రవాహనదారులను ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఎర్నిమాంబకు విశేష పూజలు


అమ్మవారికి హారతి ఇస్తున్న భక్తురాలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో సురేష్‌బాబా నేతృత్వంలో అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు కల్పించారు. భక్తులు మాంసహారాలతో వంటవార్పులు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎర్నిమాంబ సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.